విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 01,ఆగస్టు 2024

రిజర్వాయర్ కట్టపై గుంత పూడ్చివేత

విశాలాంధ్ర-వెలుగోడు: తెలుగు గంగ ప్రాజెక్టులో భాగమైన ఎన్టీఆర్ జలాశయ మట్టికట్టపై వర్షాలకు భారీ గుంత ఏర్పడిన సంగతి పాఠకులకు విధితమే. పత్రికలలో వచ్చిన కథనాలకు స్పందించిన తెలుగంగ అధికారులు భారీ వర్షాలకు మట్టి కట్టపై కోత ఏర్పడి 20 అడుగుల మీద గుంత ఏర్పాటయింది. ఈ గుంతను తెలుగంగ డీఈ ఏఈ ఇలియాస్ ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో మట్టిని తోలి గుంతను పూడ్చి వేశారు. అయితే ఇలాంటి గుంతలు మట్టికట్టపై అక్కడక్కడ ఉన్నాయని ప్రజలుతెలియజేస్తున్నారు. మట్టికట్టపై నిర్వహణ లోపంతో అక్కడక్కడ గుంతలు ఏర్పడినట్లు తెలుస్తుంది. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండటానికి మట్టికట్ట పటిష్ఠ చర్యలను అధికారులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వన్ ఆర్ తూము నుంచి సాగునీటి విడుదల

విశాలాంధ్ర-వెలుగోడు: వెలుగోడు మండల రైతుల కోరిక మేరకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలుగంగ ప్రాజెక్టు లోని ఎన్టీఆర్ జలాశయ వన్‌ఆర్ తూము నుంచి బుధవారం అధికారులు, నాయకులు సాగునీటిని విడుదల చేశారు. గంగమ్మకు పూజా కార్యక్రమాలు నిర్వహించి హారతి ఇచ్చి, వన్ ఆర్ తూము గేటు ఎత్తి 20 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేసినట్లు గంగ అధికారులు తెలిపారు. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్ చానల్ ద్వారా వెలుగోడు రిజర్వాయర్‌లోకి 15వేల క్యూసెక్కులు కృష్ణాజిల్లాలు వస్తున్నట్లు తెలిపారు. రిజర్వాయర్లో ప్రస్తుతం 255.69 అడుగుల నీటి మట్టంతో 4.91 టీఎంసీల నీరు నిలువ ఉన్నట్లు ఏఈ ఉదయ్ కుమార్ తెలిపారు.తెలుగుగంగ డీఈ, ఏఈ ఇలియాస్, టీడీపీ నాయ కులు అబ్దుల్ కలాం, శేశిరెడ్డి మండ్ల శంకర్ రెడ్డి, ఖలీలుల్లా, డాక్టరు జాకీర్ హుస్సేన్, హిదాయత్ ఆలీ, రసూల్, సూర్యనారాయణ, నాగ శేఖర్, శివన్నలు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదు



విశాలాంధ్ర-ప్యాపిలి: వైసీపీ నాయకులు అధికార తెలుగుదేశం పార్టీ శ్రేణులపై దాడులు కొనసాగిస్తే సహించే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు.మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో గత కొద్దిరోజుల కిందట వైసీపీ నాయకులు అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు నారాయణపై దాడిచేసి గాయపరచడం జరిగింది. బుధవారం గాయపడిన నారాయణను, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి అంతే కాకుండా విపరీతంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసిన ఘనత వైసీపీ పార్టీకే తగ్గిందని వారు ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన మాజీ ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నియోజకవర్గంలో ముఖం చూపించుకోలేక ఆంధ్ర రాష్ట్రాన్ని వదిలి తెలంగాణ రాష్ట్రంలో ప్రెస్‌మీట్ పెడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని కూడా అప్పుల్లో ముంచడానికి మీ ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తుందని మీరు మన రాష్ట్రం గురించి మన నియోజకవర్గ గురించి మాట్లాడాలంటే స్థానికంగా ఉండాలి తప్పా రాష్ట్రం వదిలి పోవడం సిగ్గుచేటని, ఓడిన గెలిచిన ప్రజల మధ్య ఉండాలని,రాష్ట్రం వదిలి వెళ్ళకూడదని ఆమె హితవు పలికారు.త్వరలోనే నియోజకవర్గంలోని అన్ని చెరువులు నింపే కార్యక్రమం పూర్తి చేస్తామని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా మేము అండగా ఉంటామని కార్యకర్తలకు భరోసాన్ని ఇవ్వడం జరిగినది.కార్యక్రమంలో పొదొడ్డి గ్రామనాయకులు పుల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని పాటించాలి



విశాలాంధ్ర-అవుకు: ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు పాటించాని నంద్యాల ప్రకృతి వ్యవసాయాధికారి రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం రామకృష్ణ ఆధ్వర్యంలో మండల అభివృద్ధి అధికారి మల్ రెడ్డి, మండల విద్యాధికారి శ్రీధర్ రావు, ఏపిఎం విజయ్ గోపాల్‌లతో కలిసి పాదుపు మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పంటల సాగులో రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని పాటించాలని అన్నారు. ముఖ్యంగా విత్తనాల ఎంపిక విత్తనశుద్ధి మరియు నారుశుద్ధి గురించి రైతులకు తెలియజేశారు. జీవామృతం తయారీ, వాటికి కావలసిన పదార్థాలు మరియు వాటి ఉపయోగం గురించి తెలియజేశారు. రైతులు ప్రకృతి వ్యవసాయం పాటించేటప్పుడు అంతర పంటలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య లీడర్లు, వివో ఏలు, ట్రైనర్ సుబ్బరాయుడు, యూనిట్ ఇన్చార్జి పేరు రాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫేక్ ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి-ఎస్సై రమణయ్య

విశాలాంధ్ర-చాగలమర్రి: మండల ప్రజలు ఫేక్ ఫోన్ కాల్స్ పై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమణయ్య కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కొంత మంది ప్రజలకు కొత్త నంబర్ల నుండి ఫోన్ చేసి పోలీసు స్టేషన్ లో పని చేసే సిబ్బంది అని వారి బంధువులు ఆసుపత్రిలో వున్నారని మీకుక్యాష్ పంపిస్తాము అర్జెంట్‌గా అమౌంట్ ఫోన్ పే చేయమని అడిగి డబ్బులు వేయించుకుంటున్న ఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా వుండి అలాంటి వారికి ఎలాంటి నగదు పంపించవద్దన్నారు. ఆన్లైన్ మోసాలకు గురయితే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయలని కోరారు.

విద్యార్థుల శ్రమదానం



విశాలాంధ్ర-చాగలమర్రి: స్థానిక శ్రీవాసవి డిగ్రీ కళాశాల విద్యార్థులు కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో బుధ వారం శ్రమదానం చేసారు. స్థానిక రామలింగేశ్వర ఆలయ ఆవరణంలో చుట్టూతా ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించడంతో పాటుగా చెత్తాచెదారం లేకుండా శుభ్రపరచారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆరినేటర్ మహేశ్వరయ్య, డిగ్రీకళాశాల కరెస్పాండంట్ రఘురామ్, కార్యదర్శి పుల్లారెడ్డి, శేషయ్య,విద్యార్థులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌తోనే ఆరోగ్యం పథిలం

విశాలాంధ్ర-నంద్యాల: క్రమం తప్పకుండా రోలర్ స్కేటింగ్ చేస్తే ఆరోగ్యం పథిలమని శ్రీసంకల్ప్ పాఠశాల అధినేత సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బాలాజి కాంప్లెక్స్‌లోని శ్రీసంకల్ప్ పాఠశాలలో రోలర్ స్కేటింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుధాకర్ పాల్గొని ప్రారంభించారు.ప్రిన్సిపల్ దివ్యకోషి, విద్యార్థులు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇది మంచి కృత్యంగా పని చేస్తుందని, క్రమం తప్పకుండా స్కేటింగ్ చేస్తే గుండె సంబంధ రోగాలను కూడా నియంత్రిస్తుందని, భయాన్ని తొలగించి విద్యార్థుల్లో ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తుందన్నారు. మంచి ప్రయోజనాలు కలిగిన రోలర్ స్కేటింగ్‌ను ప్రారంభించడం ఆనంద దాయకంగా ఉందని తెలిపారు.

దాతృత్వం చాటుకున్న సర్పంచు రావిమోహన్

విశాలాంధ్ర-డోన్ : రహదారికి ఇరువైపులా కంప చెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా ఉండటంతో వందల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులను దృష్టిలో ఉంచుకొని బి.బొంతిరాళ్ల సర్పంచు, న్యాయవాది రవి మోహన్ బుధవారం ఉదయం తనసొంత నిధులతో రోడ్డుకుఇరువైపులా ఉన్న ముళ్లపొదలను జెసిబి సహాయంతో తొలగించారు.

బీసీ గురుకుల పాఠశాలలో విచారణ..!

ప్రిన్సిపాల్ అవినీతిపై ఏఐఎస్ఎఫ్ ఫిర్యాదు

విశాలాంధ్ర-డోన్ : డోన్‌పట్టణంలో మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల విద్యాసంస్థలో సీట్ల విషయంలో జరిగిన ప్రిన్సిపాల్ అవినీతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతూ విజయవాడలో కమిషనర్ కి ఫిర్యాదు చేయగా దానిపైన స్పందించి నంద్యాల జిల్లా బీసీ గురుకుల కన్వీనర్ ఫ్లోరమ్మ విచారణ చేపట్టారు.ఆ బుధవారం బీసీ పాఠశాలలో విచారణ చేపట్టగా భారీగా అవినీతి బయటపడిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్యప్రతాప్ మాట్లాడుతూ “గత వైసీపీ ప్రభుత్వం లో అన్ని విధాలుగా వెనుకబడిన డోన్ నియోజకవర్గంలో వెనుకబడిన తరగతులకు సంబంధించిన విద్యార్థుల కోసం వారు చదువుకోవడానికి అవకాశం కల్పించాలని, గతేడాది మహాత్మ జ్యోతిరావుపూలే బీసీ గురుకులను ఐదో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రారంభించడం జరిగిందన్నారు.ప్రారంభ దశ నుంచి నేటి వరకు ఆర్థికంగా వెనకబడిన పేద తరగతి విద్యార్థులకు కాకుండా ఎమ్మెల్యేలు, మినిస్టర్లు, సెంటర్ మినిస్టర్లు డొనేషన్ల పేరుతో పదివేల నుంచి 25 వేల వరకు ఎవరైతే ఇస్తారో వారికి మాత్రమే పూర్తిస్థాయిలో 90% సీట్లు కేటాయిస్తూ అవినీతికి పాల్పడ్డారన్నారు. బీసీ గురుకుల విద్యాసంస్థలో ప్రిన్సిపాల్ దగ్గర నుంచి కొంతమంది ఉపాధ్యాయులు,అక్కడ వంట చేసే పని మనుషుల వరకు గత ప్రభుత్వంలో బుగ్గన రాజా రెడ్డి రికమండేషన్ తో ఉద్యోగాలు పొందిన వాళ్ల తప్ప ...ఎవరు కూడా న్యాయంగా ఉద్యోగాలు సాధించిన వారు ఎవరూ లేరన్నారు.ప్రిన్సిపాల్ ను విధులు నుంచి తొలగించాలని వారు నంద్యాల జిల్లా కన్వీనర్ ఫ్లోరమ్మని డిమాండ్ చేయగా... దీనిపైన కన్వీనర్ స్పందిస్తూ కలెక్టర్ కి రిపోర్ట్ ఇచ్చి ఆమె పైన యాక్షన్ తీసుకుంటామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు మనోజు, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గజిట్ నిబంధనల ప్రకారమే సుంకాలు వసూలు చేయాలి

16వ వార్డు చిగరమానుపేటలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సిందే -కౌన్సిలర్ సుంకయ్య డిమాండ్

విశాలాంధ్ర-డోన్ : డోన్ మున్సిపల్ గజిట్ నిబంధనల ప్రకారం చిరువ్యాపారులుతో కాంట్రాక్టర్లు సుంకాలు వసూలు చేయాలి , అలాగే 16వ వార్డు చిగరవానిపేటలో అభివృద్ధి కార్యక్రమాలు కరెంటు స్తంబాలు,కాలువలు, సిసి రోడ్లు వెంటనే పనులు ప్రారంభించాలని లేకుంటే ఆందోళన సిద్ధమవుతామని డోన్ సీపీఐ మున్సిపల్ 16వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేశారు.బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సీపీఐ 16వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ వి సుంకయ్య మాట్లాడుతూ మంగళవారం జరిగిన డోన్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 38 అంశాలు అజెండాలో ఉన్నాయని, వాటిలో ప్రధానంగా రోజువారి మార్కెట్లో ప్రజలతో సుంకాలు వసూలు చేయుట, విధుల్లో మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం, పట్టణంలో వీధిలైట్లు, సీసీ రోడ్లు, కాలువలు, మంచినీటి సరఫరాకు ఏర్పాట్లు కరెంటు లేని వీధుల్లో స్తంభాల ఏర్పాటు చేయాలన్నారు.పట్టణంలో ప్రజలకు ఇబ్బందిగా మారిన వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలన్నారు.20 మంది డైలీ వేజెస్ కార్మికులను ఆప్కాస్ చేర్చాలన్నారు.అంతవరకు 12 వేల నుండి 16 లేదా 18 వేలకు వేతనం పెంచాలన్నారు.డోన్ మున్సిపాలిటీలో అన్ని విభాగాల్లో అవినీతి లేకుండా ప్రజలకు పని చేయాలన్నారు.

మహిళా మార్ట్ కు శంకుస్థాపన చేసిన మంత్రి ఫరూక్



విశాలాంధ్ర-నంద్యాల : స్థానిక ఎస్ఆర్బిసి కాలనీలో మహిళా మార్ట్‌కు న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఎస్ఆర్బిసి కాలనీ అభివృద్ధికి, మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసమే ఇక్కడ మార్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎస్ఆర్బిసి కాలనీకి అన్ని సౌకర్యాలు కల్పిస్తూ వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. అక్కడికి విచ్చేసిన కాలనీ ప్రజలు మంత్రికి సమస్యలు తెలిపారు. స్పందించిన ఫరూక్ మున్సిపల్ కమిషనర్ కు, సిబ్బందికి తగిన సూచనలిచ్చారు.కాలనీలో రోడ్లు, కాలువలు, వీధిదీపాలు, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామని. మంత్రి ఫరూక్ అక్కడి స్థానికులకు హామీ ఇచ్చారు.వైసీపీ ప్రభుత్వంలో కేవలం రంగులు కొట్టుకోవడం కోసమే వారు పాటు పడ్డారే తప్పా అభివృద్ధి కోసం కాదని ఎద్దేవా చేశారు. నంద్యాలలో ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ మంత్రి భరోసా ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నిసా, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, వైస్ చైర్మన్లు శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వినుతులు స్వీకరించిన మంత్రి బీసీ



విశాలాంధ్ర-బనగానపల్లె : స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు వివిధ సమస్యలపై ఆర్అండ్‌బిశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను వినుతుల రూపంలో ఇవ్వడం జరిగింది.ఈసందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వాటిని స్వీకరించి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది.

సీఎం బాబు శ్రీశైలం పర్యటన భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర-నంద్యాల : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం నంద్యాల జిల్లా శ్రీశైలంలో పర్య టించనున్న సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాలు స్వయంగా పర్యటించి తీసుకోవలసిన భద్రత చర్యల గురించి సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీశైలం చేరుకున్నప్పటి నుండి తిరిగి వెళ్లే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుం డా సుమారు 11 00 మంది పోలీస్ అధికారులు, సి బ్బందితో కట్టుదిట్ట మైన భద్రతా ఏ ర్పాట్లు చేశారు. సీఎం పర్యటించే ప్రదేశాలను 11 సెక్టర్లుగా విభజించడం జరిగిందని, ప్రతి సెక్టార్ కు ఇన్స్పెక్టర్ స్థాయి అధికారిని ఆపై డి.ఎస్.పి స్థాయి అధికారులు నియమించడం జరిగిందన్నారు. సుండిపెంట హెలిపాడ్ నుండి టెంపుల్ వరకు, హెలిపాడ్ నుండి పవర్ ప్రాజెక్ట్ దాం వరకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సుమారు 180 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తూ ఒక డీఎస్పీ స్థాయి అధికారితో పాటు ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులను నియమించడం జరిగింది. బిడి టీంకు డిఎస్పి స్థాయి అధికారిని నియమించి డిఎఫ్ఎండి, హెచ్ఎఫ్ఎండిలు, ఇతర పూర్తి పరికరాలతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. హెలిప్యాడ్ నుండి శ్రీశైలం ముఖద్వారం, హఠకేశ్వరం, సాక్షిగణపతి, నందిసర్కిల్, వివిఐపి అతిథి గృహ పరిసర ప్రాంతాలు, కొత్తపేట సుండిపెంట స్విచ్ యాడ్ లింగాల గట్టు, ఆనకట్ట మొదలగు ప్రాంతాల్లో కట్టుబిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగింది. గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ బలగాలతో శ్రీశైలం అడవులన్నింటిని జల్లెడ పట్టడం జరిగిందన్నారు.

తహసీల్దార్ బదిలీ... ప్రజలకు తప్పని కష్టాలు

విశాలాంధ్ర-నంద్యాల అర్బన్: గతవారం నంద్యాల తహసీల్దార్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించక పోవడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పది రోజుల నుండి రెగ్యులర్ తహసీల్దార్ ను నియమించకపోవడంతో ప్రజలు రోజుతమ పనులు మానుకొని సంతకాల కోసం చెప్పులు అరిగేలా తిరుగుతున్నారని అన్నారు. ఇన్చార్జి తహసీల్దార్‌ను అడిగితే తనకు సంబంధం లేదని సాకులు చెప్పి తప్పించుకుంటున్నాడని మండి పడ్డారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా రెగ్యులర్ తహసీల్దార్ వచ్చేంత వరకు ఉన్నత అధికారులు ఇన్చార్జి తహసీల్దార్‌ను నియమించినప్పటికీ అలా జరగడంలేదని ఆయన విమర్శించారు. కార్యాలయంలోని సిబ్బంది, అధికారులు ప్రజలకు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారన్నారు.మండల తహసీల్దార్ కార్యాలయానికి రోజు వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు వారికి ఇబ్బంది కలగకుండా చూడాలని కలెక్టర్, ఆర్డీవో దృష్టి పెట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితిగా కోరుతున్నామని ప్రసాద్ తెలిపారు.

మినీ గోకులాలకు ధరఖాస్తు చేసుకోండి-ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్



విశాలాంధ్ర-చాగలమర్రి : ఆసక్తి గల పాడి రైతులు మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక పశువైద్యశాలలో విలేకరులతో మాట్లాడుతూ చాగలమర్రి-25,ఉయ్యాలవాడ-25 మండలాలకు మినీ గోకులాలు మంజూరయ్యాయన్నారు. రెండు పశువుల మినీ గోకులం యూనిట్ విలువ రూ. 1.15 లక్షలు ఉపాధి హామీ నిధులు రూ.1,03,500 రైతు వాటా రూ 11,500, 4 పశువుల మినీ గోకులం యూనిట్ విలువ రూ. 1,85 లక్షలు ఉపాధి హామి నిధులు రూ 1,66,500 రైతు వాటా రూ 18,500, 6 పశువుల మినీ గోకులం యూనిట్ విలువ 2.30 లక్షలు ఉపాధి హామీ నిధులు రూ 2.07లక్షలు రైతు వాటా రూ 23 వేలు ఉంటుందన్నారు.

గొర్రెలు,మేకల షెడ్లు

20 జీవాల షెడ్ యూనిట్ విలువ రూ. 1.30లక్షలు. ఉపాధి హామీ నిధులు రూ.91వేలు, రైతు వాటా రూ 39 వేలు,50 జీవాల షెడ్ యూనిట్ విలువ రూ.2.30 లక్షలు. ఉపాధి హామీ నిధులు రూ 1.61లక్షలు కాగా రైతు వాటా రూ 69 వేలు,100 కోళ్ళ షెడ్ యూనిట్ విలువ రూ.87వేలు, ఉపాధి హామీ నిధులు రూ 60,900 వేలు కాగా రైతు వాటా రూ 26,100, 200 కోళ్ళ షెడ్ యూనిట్ విలువ రూ. 1.32లక్షలు.ఉపాధి హామీ నిధులు రూ.92,400వేలు కాగా, రైతు వాటారూ 39,600లు చెల్లించాల్సి ఉంటుందన్నారు.ఆసక్తి గల వారు దరఖాస్తు ఫారంతో ఆధార్, జాబ్ కార్డు, స్థలం హక్కు పత్రం,బ్యాంక్ పాస్ బుక్‌లతో దగ్గరలోని పశు వైద్యశాల, రైతు సేవాకేంద్రంలో సంప్రదించాలన్నారు.

రసాభాసాగా నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఏ ఒక్కరిని కూడా కించపరుస్తూ మాట్లాడడం తగదన్న కౌన్సిలర్లు

విశాలాంధ్ర-నంద్యాల : నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధ వారం రసాభాసాగా జరిగింది.బుధవారం చైర్ పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైసీపీ కౌన్సిలర్లు కూటమి ప్రభుత్వం ఇంతవరకు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయంపై కౌన్సిలర్ ఖండే శ్యాం సుందర్ లాల్ తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 56 రోజులయిందని, త్వరలో ఇచ్చిన హామీలు నెరవేర్చుతారన్నారు. కౌన్సిలర్ తబ్రేజ్ మాట్లాడుతూ ఏవ్యక్తిని కూడా అవమాన పరుస్తూ, కించపరుస్తూ సమావేశంలో మాట్లాడడం తగదని తోటి కౌన్సిలర్‌కు హితవు పలికారు. ఇలా ప్రవర్తిస్తే భవిష్యత్తులో గందరగోళం నెలకొంటుందని, ప్రజలకు ఏమి సమాధానం చెబుతామని ప్రశ్నించారు. ఒక వ్యక్తి గురించి మాట్లాడితే హుందాగా మాట్లాడాలన్నారు. కౌన్సిల్లో ప్రవేశ పెట్టిన అజెండాపై సభ్యులు పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అజెండాలోని నాలుగవ అంశమయిన 2018-19, 2019-20లకు సంబంధించిన ఎస్సీ,ఎస్పీ పనుల బిల్లులు 25 లక్షలను కాంటాక్టర్లకు చెల్లించాలని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులు తిరస్కరించడంతో చైర్మన్ వాయిదా వేశారు. అలాగే 18వ అంశం నంద్యాల పట్టణంలోని శ్రీనిధి హెూటల్ నుండి పద్మావతి నగర్ మెయిన్ రోడ్డు వరకు 50 అడుగుల రహదారిని విస్తరించాలని ప్రతిపాదించగా పలువురు సభ్యులు అభ్యంతరం తెలపడంతో వాయిదా వేశారు. అలాగే పలువురు సభ్యులు తమ వార్డు సమస్యలు పరిష్కరించాలని కోరారు. వీధి దీపాలు లేవని దేవనగర్ కౌన్సిలర్ శేఖర్ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి మాట్లాడుతూ పది రోజుల్లో కుక్కల కట్టడి చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని సమాధానం చెప్పారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారని టిడిపి కౌన్సిలర్ మాబువలి ప్రశ్నించారు.

ఈ సమావేశంలో వైస్ చైర్మన్‌లు శ్రీధర్, పాంషావలితో పాటు పలువురు కౌన్సిలర్లు, అధికారులు ఎమ్ఈఈ రమణ మూర్తి, అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి, డీఈలు జయబారత్ రెడ్డి, మదుకుమార్, శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి

విశాలాంధ్ర-చాగలమర్రి : ప్రతిఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరిని కడప జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన చాగలమర్రిలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మండలంలోని గొడెగనూరు పంచాయతీ కార్యదర్శి గుత్తి దస్తగిరిపదవీ విరమణ కార్యక్రమానికి ఆయనముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా దస్తగిరి దంపతులను ఆయన ఘనంగా సన్మానించారు. సంక్షేమ పథకాల అమలు, గ్రామంలోని సమస్యల పరిష్కారంలో దస్తగిరి సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు,డీఎల్‌డీవో జుబేదా, గొడెగనూరు సర్పంచు సంజీవరాయుడు,ఎంపీటీసీనారాయణ,ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, డి ప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటీసీలు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న వంగలిలో..



ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరిగా వస్తుందని ఎంఈవోలు అనురాధ,న్యాంతుల్లాలు తెలిపారు. జీవయ్య తెలిపారు.బుధవారం మండలంలోని చిన్నవంగలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న చంద్రశేఖర్ పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయునిగా పాఠశాలకు, విద్యార్థులకు చేసిన సేవలను పలువురు వివరించారు.కార్యక్రమంలో ఎస్టీయూ, పిఆర్‌టియు, యూటిఎఫ్ సంఘాల నాయకులు,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి



విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: మండలంలోని అల్లూరులో విద్యుత్ లైన్మెన్ గా విధులు నిర్వహిస్తున్న సుంకయ్య(45) బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఏఈ గురప్ప, గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు గ్రామంలో గంగమ్మ ఆలయం సమీపంలో ఉన్న కుంటకట్ట వద్ద ట్రాన్స్ఫారంకు ఎక్స్‌ఫీజు వేస్తుండగా ప్రమాద వశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో వెంటనే కింద పడ్డాడు. తీవ్రంగా గాయాలైన సుంకయ్యను చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు 2011లో విధుల్లో చేరారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ ప్రజల మన్ననలను పొందారు. ఈయన సేవలను గుర్తించి 2023 జనవరి 26 రిపబ్లిక్ డే పురస్కరించుకొని జిల్లా ఎస్ఈ ఉమాపతి అవార్డును అందజేశారు. అవార్డును అందుకోవడంతో అప్పట్లో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, మాజీ సర్పంచు శివరామకృష్ణారెడ్డిలు సుంకయ్యకు శాలువ కప్పి సన్మానించారు. ఈయన మృతిపట్ల ఏఈ, సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడికి భార్య పుల్లమ్మ, ఇద్దరు కుమార్తెలు కలరు.

సిమెంట్ ట్రైలర్ బోల్తా.. డ్రైవర్ కు గాయాలు

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : మండలంలోని కల్వటాల గ్రామ సమీపంలో బ్రిడ్జిపై సిమెంట్ ట్రైలర్ మంగళవారం అర్ధరాత్రి అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ట్రైలర్ లారీ డ్రైవర్ వేల్మురుగన్ గాయపడ్డాడు.తమిళనాడు రాష్ట్రానికి చెందిన ట్రైలర్ వైయ స్సార్ కడపజిల్లా జమ్మలమడుగు మండలంలోని దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీలో సిమెంట్ లోడ్ చేసుకోని బెంగళూరుకి వెళుతుండగా మార్గమధ్యలో ప్రమాద సంఘటన చోటు చేసుకుంది. గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్దకు రాగానే ట్రైలర్ అదుపుతప్పి బ్రిడ్జిపై బోల్తా పడింది. గాయపడ్డ డ్రైవర్ వేల్ మురుగన్ చికిత్స నిమిత్తం 108లో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శుద్ధ జలాన్ని అందించేందుకు కృషి చేస్తాం



విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: కుందూ తీరం వెంట ఉన్న 14 గ్రామాల ప్రజలకు కుందూనది ఒడ్డున ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేసి కులాయిల ద్వారా శుద్ధ జలాన్ని సరఫరా చేసేందుకు ప్రయత్నం చేస్తామని ఆర్డబ్ల్యుస్ ఏఈ ఫణీత్ కృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలాధ్యక్షురాలు బుడ్డా బాగ్యమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు కుళాయిలకు బురద నీరు వస్తుందని వీటిని తాగితే ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని సభ దృష్టికి తీసుకెళ్లారు. అజెండాలో పొందుపరిచిన అంశాల్లో భాగంగా ఎంఈఓ వీర ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలో 32 పాఠశాలలున్నాయనీ, 2,395 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని వీరందరికీ పూర్తిస్థాయిలో స్టూడెంట్ కిట్ అందజేశామన్నారు. ఆర్.జంబులదిన్నె, నర్సిపల్లె గ్రామాల్లో ఒక్కొక్క ఉపాధ్యాయుడు మాత్రమే పాఠశాలలో కొనసాగుతున్నారని దీంతో ఏదైనా ఉపాధ్యాయుడు సెలవు పెడితే పాఠశాలలో దిక్కు ఎవరని సర్పంచులు ప్రసాద్, పల్లె గురుప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బాలిరెడ్డిలు ప్రశ్నించారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో 25 ఎంపీపీ పాఠశాలలు ఉండగా 13 పాఠశాలల్లో ఒక్కొక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారన్నారు. ఈ విషయం జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని సభ్యులకు వివరించారు.సభలో వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు బాధ్యతాయుతంగా పనిచేస్తే గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఆర్థికపరమైన అంశాలపై సమావేశంలో తీర్మానం చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని ఎంపీడీవో రఘు రాంను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు అమీర్ అహ్మద్, ఎంపీటీసీలు, సర్పంచులు ఆర్ అండ్ బి డి ఈ సునీల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ నూతన శాఖ ఏర్పాటు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : బుధవారం నగరంలోని ప్రకాష్ నగర్ రోజాదర్గా ప్రాంతంలో భారత కమ్యూనిస్టు పార్టీ నూతనంగా శాఖను ఏర్పాటు చేశారు. నగర కార్యదర్శి పి. రామకృష్ణారెడ్డి, సహాయకార్యదర్శి సి.మహేష్‌లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో దాదాపుగా 50 కుటుంబాలు సీపీ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ప్రకాష్ నగర్ నూతన కమిటీ శాఖ కార్యదర్శిగా ఆశ, సహాయకార్యదర్శిగా షాలిమార్బి రేష్మబేగం, సభ్యులుగా సయ్యద్, హరిత, జ్యోతి, జయమ్మ, ధనలక్ష్మి, గౌసియా, తులసి, హరిత, షాహిద్, ఖాదర్ భాష, తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నగరంలోని ప్రకాష్ నగర్, రోజా వీధి తదితర ప్రాంతాలలో సమస్యలను పూర్తిగా స్థానిక కార్పొరేటర్లు విస్మరించారని దుయ్యబట్టారు. వార్డుల్లో అపరిశుభ్రత పెరిగిపోయి ద్వారా ప్రజలకు పలు రకాల జబ్బులు వ్యాపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయాలన్నారు. సొంతిల్లు లేని పేదలు ఇంటి అద్దెలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని, నూతన ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకొని ఇల్లు లేని ప్రతి నిరుపేదలకు రెండు సెంట్లు స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించుమకోవడానికి రూ 6 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కార్యక్రమంలో నాయకులు కుమార్, రాజా, అశోకు, భాష పాల్గొన్నారు.

వైద్య కేంద్రంగా కర్నూలు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: రాయలసీమ జిల్లాల్లో వైద్య రంగానికి కర్నూలు కేంద్రంగా మారుతుందని, మరో కార్పొరేట్ ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి రావడం హర్షించదగ్గ విషయమని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ తెలిపారు. బుధవారం ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన అశ్విని హాస్పిటల్స్ ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ గతంలో మెరుగైన వైద్య సేవల కోసం కోసం ఇతర మెట్రో నగరాలకి వెళ్లాల్సిన అవసరం వచ్చేదని, ఆ అవసరం లేకుండా ఇక్కడే ఎన్నో కార్పొరేట్ హాస్పిటల్స్ రావడంతో, అన్నిరకాల వైద్య సేవలు కర్నూలుకు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. సీనియర్ వైద్యులు శ్రీనివాస్‌రెడ్డి మొదటినుంచి కూడా సేవాభావం కలిగిన వ్యక్తిని, అలాంటి వ్యక్తి ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆధునికవసతులతో హాస్పిటల్ నిర్మించడం అభినందనీయమన్నారు. ఆయనతోపాటు ఆయన కుటుంబ సభ్యులందరూ కూడా వివిధ విభాగాలలో నిష్ణాతులైన డాక్టర్లు కనక 24 గంటలు ఉత్తమ వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తారని ఆశిస్తున్నానని టీజీ వెంకటేష్ అన్నారు. ఇలాంటి హాస్పిటల్స్ నిర్మాణంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు, మరి ఎంతోమందికి వివిధ రకాలుగా ఉపాధి కూడా లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ నేత గౌరు వెంకటరెడ్డి, పారిశ్రామికవేత్త టీవీ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు నందిరెడ్డి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏసీఎల్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలి

- ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నా
- సీపీఐ జిల్లా కార్యదర్శ గిడ్డయ్య

విశాలాంధ్ర-ఆదోని: కార్మికుల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టించిన ఏసీఎల్‌పై శాఖపరమైన చర్యలు తీసుకొని ఆలూరు హామాలీ కార్మికులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లాకార్యదర్శి గిడ్డయ్య,ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయుసీ ఆలూరు నియోజకవర్గ కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ గత 35ఏళుగా ఆలూరు ఏఐటీయుసీ అనుబంధ హామాలీ కార్మిక సంఘం వివిధ రకాల సరుకులను లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తూ జీవనం సాగిస్తుంటే ఎలాంటి ముందస్తు విచారణ చేయకుండ కొత్త యూనియన్ రిజిస్ట్రేషన్ చేసి హమాలీల మధ్య ఘర్షణలను సృష్టిస్తున్న ఏసీఎల్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏసీఎల్ కొత్త యూనియన్ రిజిస్ట్రేషన్ చేయడంతో పాత హామాలీల కుటుంబాలు ఉపాధి లేక జీవనం సాగించడం దారుణంగా వుందని, రిజిస్ట్రేషన్ చేసిన యూనియన్‌ను తక్షణమే రద్దు చేసి అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మను కోరారు. అంతకు సబ్ కలెకర్ల కార్యాలయం ముందు హామాలీ కుటుంబాలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేయడంతో స్పందించిన సబ్ కలెక్టర్ తక్షణమే ఏసీఎల్‌ను కార్యాలయానికి పిలిచి విచారించారు. సబ్ కలెక్టర్ విచారణ అనంతరం ఏసీఎల్ సురేష్‌బాబు కార్మికులకు సరైన హామి ఇవ్వకపోవడంతో కార్మికులు ఆగ్రహానికి గురయ్యారు. అంతలో పోలీసులు, సబ్ కలెక్టర్ జోక్యం చేసుకొని కార్మికులకు స్పష్టమైన హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూపేష్, సీపీఐ కార్యవర్గ సభ్యులు విరుపాక్షి, సీపీఐ సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావి రాజు, ఏఐటీయుసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వైటీ భీమేష్, వెంకన్న, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి విజయ్, లక్ష్మీనారాయణ, ఏఐటీయుసీ జిల్లా సమితి సభ్యులు హుసేనీ, శేక్షావలి, గోపాల్, రమేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-సి.బెళగల్: మండల పరిధిలోని గుండ్రేవుల సమీపంలోని తుంగభద్ర నది దగ్గర గల కృష్ణదొడ్డి ఎత్తిపోతల పథకాన్ని బుధవారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు. గుండ్రేవుల దగ్గర తుంగభద్రా నది ఒడ్డున నదిలో పూజారులు పూజలు నిర్వహించి జల హారతి ఇచ్చి టెంకాయలు కొట్టి అనంతరం అక్కడున్న కృష్ణదొడ్డి ఎత్తిపోతల పథకంలో మోటార్లకు పూజలు నిర్వహించి నాయకులతో కలిసి మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈకార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌శైలేశ్వర్, కృష్ణదొడ్డి ఎత్తిపోతల పథకం కమిటీ చైర్మన్ కాలువ సోమిరెడ్డి, పోలకల్ చిన్న తిమ్మప్ప, గంపరాజు వెంకటేశ్వర్లు, అమర్నాథ్ మరియు మాజీ జెడ్పీటీసి చంద్రశేఖర్ మరియు భీమన్న, ధనుంజయ, గౌస్ వివిధ గ్రామాల టీడీపీ నాయకులు కార్యకర్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ ఎన్నికలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలి

విశాలాంధ్ర-ఆదోని రూరల్: ఈ నెల 8 నుంచి జరగనున్న పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నికలో రాజకీయ జోక్యం లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎస్టీయూ జిల్లాఅదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి.సుంకన్న కోరారు. బుధవారం ఎస్టీయూ భవన్లో ఆదోని, కౌతాళం మండలం ఎస్టీయూ ముఖ్య నాయకుల సమావేశం ఆదోని మండల అధ్యక్షుడు చింతకుంట రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏంసి. సుంకన్న హాజరై మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు భద్రత కల్పించి ఎన్నికలు సజావుగా జరిగేటట్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో పాఠశాలలకు అభ్యున్నతకు తోడ్పడే నాయకున్ని పాఠశాల కమిటీలో చైర్మన్గా ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల కమిటీ ఎన్నికల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి గోపాల్, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు రామాంజనేయులు, ఆంజనేయ,ఈశ్వరయ్య, లక్ష్మన్న, వి.రామాంజనేయులు ఎస్ఎస్.భాస్కర్ తదితరులు ఉన్నారు.

పెరగని నీటిమట్టం..ఆందోళనలో ఆయకట్టు రైతులు

విశాలాంధ్ర-హొళగుంద: మండలంలో ప్రవహించే తుంగభద్ర ఎల్లెల్సీ దిగువ కాలువలో నీటిమట్టం పెరగక పోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. తుంగభద్ర జలాశయం 1633 అడుగులతో పూర్తిస్థాయితో నిండి పోయింది. తుంగభద్ర జలాశయంలో వరద నీరు భారీస్థాయిలో చేరడంతో తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి 33 క్రష్ గేట్లను ఎత్తి తుంగభద్రా నదికి నీటిని విడుదల చేశారు. తుంగభద్ర జలాశయం వరద నీటితో తొలగిస్తున్న ఎల్లెల్సీ దిగువ కాలువలో మాత్రం నీటిమట్టం తగ్గింది. కాలువలో నీరు ప్రవహించిన సంబంధిత అధికారులు డిస్ట్రిబ్యూటరీలను ఎత్తి ఆయకట్టు పొలాలకు నీటిని విడుదల చేయడం లేదని ఆయకట్టు రైతులు తెలిపారు. వర్షం లేక పొలాలు ఎండిపోయాయని ఆయకట్టు పొలాలకు నీటిని త్వరగా వదిలితే పొలాలను నీటితో తడుచుకొని వరి పంటను వేసుకుంటామని రైతులు పేర్కొన్నారు. ఎల్లెల్సీ దిగువకాలువ నీటి ద్వారా సాగు త్రాగునీరు సమస్య తీరుతుందని ఆయకట్టు రైతులు తెలిపారు. జిల్లా కలెక్టర్ సంబంధిత సాగునీటి అధికారులు చర్యలు తీసుకుని కాలువలో నీటిమట్టం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేశారు.

నాటు సారా స్థావరాలపై విస్తృత దాడులు

విశాలాంధ్ర-తుగ్గలి: జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ ఎన్.నాగరాజుల ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండ్ ఎస్.రవికుమార్ పర్యవేక్షణలో పత్తికొండ సెబ్ పోలీసులు మండల పరిధిలోని రోళ్లపాడుతండా గ్రామ పరిసర ప్రాంతాల్లో నాటు సారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించి 2100 లీటర్ల నాటు సారా తయారీకి సిద్ధంగా ఉన్న బెల్లపు ఊటను మరియు 30 లిటర్ల నాటు సారాను ధ్వంసం చేసినట్లు సెబ్ సి.ఐ సువర్ణలత తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామవాసులకు ఎన్నిసార్లు హెచ్చరించినా నాటుసారా తయారీ చేయడం మానుకోవడం లేదని ఈ విస్తృత దాడులలో తయారీ దారులు తప్పించుకుంటున్నారని తెలిపారు. తయారీ దారులు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడులలో పత్తికొండ సెబ్ ఎస్.ఐ కార్తీక్ సాగర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-హొళగుంద: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 6న ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బి అధ్యక్షతనలో ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో కె.ఆజాద్ బుధవారం తెలిపారు. మండల సర్వసభ్య సమావేశంలో మంచి నీటి సమస్య, వైద్య, విద్య, వైద్య ఆరోగ్యం, వ్యవసాయం, ఆర్టీసీ శాఖ రెవిన్యూ, పశుసంవర్ధన శాఖ తోపాటు, ఇతర శాఖల వారీగా చర్చించడం జరుగుతుందని మండల సర్వసమావేశానికి సంబంధిత అధికారులతో పాటుగా ఎంపీటీసీ సభ్యులు, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు, అందరూ హాజరుకావాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : పారిశుద్ధ్య నిర్వహణలో తనిఖీదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్ హెచ్చరించారు. బుధవారం ఆయన 5, 6, 9వ శానిటేషన్‌డివిజన్లలో శ్రీరామ్ నగర్, దేవనగర్, బిర్లా క్వార్టర్స్, బాపూజీ నగర్, బుధవారపేట ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాలువల్లో పూడికలు పూర్తిగా తొలగించి, వాటి కుప్పలను మధ్యాహ్నం లోపు తీసివేయాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరుపై ఆరా తీసి, హాజరు సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్వైజర్ నాగరాజు, ఇంస్పెక్టర్లు ముర్తుజావలి, రమేష్ బాబు, అనిల్ పాల్గొన్నారు.

స్వతంత్ర భారతంలో మహిళలకు రక్షణ ఏదీ-సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

విశాలాంధ్ర-ఆదోని: స్వతంత్ర భారతదేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు రక్షణ కరువైందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి,ఆస్పరి మండల కార్యదర్శి విరుపాక్షి, ఆదోని సీపీఐ పట్టణ,మండల కార్యదర్శులు సుదర్శన్, కలుబావి రాజు, ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకన్న, సీనియర్ నాయకులు గోపాల్ పలువురుతో కలిసి ఓ కామాంధుడి చేతిలో హత్యాయత్నానికి గురైన పెద్దపెండేకల్ సర్పంచు ఉప్పర జయమ్మ అనే మహిళ బుధవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పరామర్శించారు. బాధిత మహిళా ఉప్పర జయమ్మకు గిడ్డయ్య మనో ధైర్యాన్ని ఇచ్చారు. దోషులు ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలని బాధితురాలు ఫిర్యాదు చేయడానికి పోలీసు సంబంధితస్టేషన్‌కు వెళ్ళితే స్పందించకపోవడం శోచనీయమని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఉప్పర జయమ్మపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని శిక్షించాలి

గ్రామ ప్రజాప్రతినిధి ఉప్పర జయమ్మపై అదే గ్రామానికి చెందిన తలారి హత్యా యత్నానికి ఒడిగట్టడాన్ని కర్నూలు జిల్లా భగీరథ నగర ఉప్పర సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సత్యన్న, వీరేంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శి చరణ్ తేజ్,లీగల్ అడ్వైజర్ కుమార్,లింగమూర్తి,వీరన్న, బసలదొడ్డి వీరేష్ పలువురు మీడియాకు తెలిపారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉప్పరిజయమును ఆ సంఘం నాయకులు పరామర్శించి మనోధైర్యాన్ని తెలియజేశారు. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన బాధితురాలు నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్సై ఎర్రి స్వామిని తక్షణమే సస్పెండ్ చేయాలని కోరుతూ తాలూకా సీఐ నిరంజన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలి

విశాలాంధ్ర-కర్నూలు బళ్లారి చౌరస్తా : జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, తక్షణమే పని సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్. గోకారి, సీనియర్ నాయకులతో కలిసి బుధవారం జిల్లా కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.శ్యాముల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో విద్యా ప్రవేశాలు గణనీయంగా పెరగడం, గత 3 నెలలుగా ఉపాధ్యాయులు పదవి విరమణ చేయడం, సుమారు 40 ప్రాథ మికోన్నత పాఠశాలలు ఉన్నతీ కరించడ వంటి కారణాలతో ఆయా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. కొన్ని ఉన్నత పాఠశాలలో 1000 మంది విద్యార్థులకు 4 మంది ఉపాధ్యాయులే పని చేస్తున్నారన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎన్ఓసీలను సత్వరమే మంజూరు చేయాలని, మెడికల్ బిల్లులను కాలయాపన లేకుండా మంజూరు చేయాలని ,పెండింగ్ విచారణలను వెంటనే పూర్తి చేసి సస్పెన్షన్ లో ఉన్న ఉపాధ్యాయులను వెంటనే పాఠశాలలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌతాళ మండలానికి మండల విద్యాశాఖాధికారిని వెంటనే నియమించాలని, వేసవి సెలవులలో పనిచేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులను మంజూరు చేస్తూ ప్రొసీడింగ్స్ ఇవ్వాలని, పదో తరగతి మూల్యాంకన నిధులను కొన్ని సబ్జెక్టులకు పూర్తిగా చెల్లించలేదని చర్యలు తీసుకోవాలని, ఉన్నత పాఠశాలలకు ఎఫ్ఏసిలుగా పనిచేసిన పాఠశాల నాయకులకు అలవెన్స్ మంజూరు చేసే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గోవింద్, గోవిందనాయక్ , దేవదాస్,సురేష్‌లు పాల్గొన్నారు.

కౌన్సిల్‌కు వైసీపీ కౌన్సిలర్లు డుమ్మా....సమావేశం వాయిదా

విశాలాంధ్ర- ఆదోని : కౌన్సిల్‌లో వైసీపీ కౌన్సిలర్‌లు రెండు వర్గాలుగా ఏర్పడడంతో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కాకపోవడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత సమావేశాన్ని వాయిదా వేశారు. 42మంది కౌన్సిలర్‌లలో టీడీపీ ఒకరు, వైసీపీ నుండి బీజేపీకి ముగ్గురు కౌన్సిలర్‌లు వెళ్లగా 38 మంది వైసీపీ కౌన్సిలర్‌లు వుండగా కౌన్సిల్ సమావేశానికి 10 మంది కూడ హాజరు కాలేదు. సమావేశాన్ని జరిపేందుకు సభకు హాజరైన చైర్‌పర్సన్ శాంత కౌన్సిల్‌లో కోరం కూడ లేకపోవడంతో అరగంటసేపు వేచి చూసి చైర్‌పర్సన్ సభను వాయిదా వేశారు.

చైర్‌పర్సన్ మారుస్తారనే రెండు వర్గాలుగా వైసీపీ కౌన్సిలర్లు

వైకాపా పార్టీకి విధేయుడైన సింహం నాగేంద్ర భార్య బోయశాంతను మున్సిపల్ చైరపర్సన్‌గా నియమించడం జరిగింది. అయితే గత రెండు నెలల నుండి చైర్‌పర్సన్‌ను మార్చుకునేందుకు వైకాపా కౌన్సిలర్‌లు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒక కౌన్సిలర్ భర్త నుండి కొంత మంది కౌన్సిలర్‌లు రూ.50వేలు చొప్పున తీసుకోవడం జరిగింది. అయితే మరో కౌన్సిలర్ భర్త మాకే చైర్‌పర్సన్ పదవీ కావాలంటూ పట్టుబట్టడంతో వైకాపా కౌన్సిలర్‌లు రెండు వర్గాలు విడిపోయారు. చైర్‌పర్సన్ పదవీనీ మేము వదులుకోమని సింహం నాగేంద్ర, చైర్‌పర్సన్ శాంత గట్టిగా వుండడంతోనే కొంత మంది కౌన్సిలర్‌లు మాట్లాడుకోని కౌన్సిల్ సమావేశానికి దుమ్మా కొట్టినట్లు సమాచారం. పట్టణ సమస్యలపై, పట్టాభివృద్ధి కోసం పాటుపడుతామని చెప్పిన కౌన్సిలర్‌లు సమావేశానికి హాజరు కాకపోవడంతో ప్రజల నుండి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

తొలిసారి ఎన్నికలు.. రేపే పోలింగ్..లెక్కింపు

- ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధం
- ఎన్నికలపై కార్పొరేటర్లకు అవగాహన
- ఐదుస్థానాలకు పదుగురు అభ్యర్థులు
- లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు
- నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ వెల్లడి

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : నగరపాలక సంస్థ స్థాయీ సంఘం సభ్యులు ఎన్నికకు సంబంధించి ఓటు వేసే విధానాన్ని కార్పొరేటర్లకు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ అవగాహన కల్పించారు. బుధవారం నగరపాలక కౌన్సిల్‌హాలులో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి మేయర్ బి.వై. రామయ్య, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు హాజరయ్యారు. ముందుగా పోలింగ్ జరిగే విధానాన్ని, ఫలితాల లెక్కింపు ప్రక్రియను వివరించారు. అనంతరం పలువురు కార్పొరేటర్లు లేవనెత్తిన సందేహాలు కమిషనర్ నివృత్తి చేశారు. ఓటేయడానికి కార్పొరేటర్లు పార్టీ కండువాలు, మొబైల్ ఫోన్లతో రాకూడదని, బ్యాలెట్ నమూనాలో పదిమంది అభ్యర్థులలో గరిష్టంగా ఐదుగురికి ఓటేసే అవకాశం ఉంటుందన్నారు. ఆపై ఎక్కువ ఓట్లేసినా, అభ్యర్థికి ఎదురుగా కాకుండా అటుఇటుగా వేసిన మొత్తం బ్యాలెట్ ఓట్లు చెల్లనవిగా పరిగణిస్తామన్నారు. అలాగే పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలను సూచించారు. కమిషనర్ రామ లింగేశ్వర్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా నగరపాలక స్థాయి సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా సాగగా, తొలిసారి ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, లోటుపాట్లు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. గురువారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. అత్యధిక ఓట్లు పోలైన ఐదుగురు అభ్యర్థులను విజేతలుగా ప్రకటిస్తామన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: మల్యాల నుంచి కృష్ణా జలాలను హంద్రీనీవాకు విడుదల చేయనున్న సమయంలో నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే. జగన్నాథం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూరత్ నుంచి చెన్నై వరకు చేపడుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ హంద్రీనీవా కాలువకు మట్టిని అడ్డుగా పోశారని తెలిపారు. హంద్రీనీవా ద్వారా రాయలసీమ జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో 885 అడుగులకు నీరు చేరిందన్నారు. ఈ నేపథ్యంలో కృష్ణజలాల నీటి విడుదల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. రైతులకు ఇబ్బంది లేకుండా రహదారి నిర్మాణ పనులు చేపడితే ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు సంపూర్ణంగా నిండినందున రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈసంవత్సరం హంద్రీనీవా ప్రధాన కాల్వ ద్వారా పంటపొలాలకు నీళ్లు వస్తాయని, కరువు నుంచి గట్టెక్క వచ్చనే భావనలో రైతులు ఉన్నారని పేర్కొన్నారు. లక్షల ఎకరాలకు నీరు అందించే సుజలస్రవంతి కాల్వను పూడ్చివేయడం చాలా దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ సందర్భంలో నీళ్లు ఆలస్యమైతే సీజన్ వృథాగా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారని,ఆలస్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన హంద్రీనీవా ప్రధాన కాలువకు అడ్డుగా ఉన్న మట్టిని తొలగించి నీళ్లు సాఫీగా పోయే విధంగా చర్యలు చేపట్టాలని జగన్నాథం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

డీఎస్పీల బదిలీ

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు: డీఎస్పీలను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. డోన్ డీఎస్పీగా ఉన్న వై.శ్రీనివాసరెడ్డిని, కర్నూలు డీఎస్పీ కె.విజయశేఖర్, నంద్యాల డీఎస్పీ ఎన్.రవీంద్రనాథ్ రెడ్డిలను బదిలీ చేస్తూ హెడ్ ఆఫీసులో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సీఐడీ డీఎస్పీగా ఉన్న పి.శ్రీనివాసులును డోన్ డీఎస్పీగా బదిలీ చేశారు. కర్నూలు దిశ డీఎస్పీగా ఉన్న జె.బాబుప్రసాద్‌ను కర్నూలు డీఎస్పీగా బదిలీ చేశారు. తిరుమల లా అండ్ ఆర్డర్ డీఎస్పీగా ఉన్న కె.శ్రీనివాసాచారిని కర్నూలు దిశ డీఎస్పీగా నియమించారు. ఆళ్లగడ్డ డీఎస్పీని షేక్ షర్ఫుద్దీన్‌ను రెండో బెటాలియన్ ఏసీగా బదిలీ చేశారు. ఆత్మకూరు డీఎస్పీనిఎ.శ్రీనివాసరావును నెల్లూరు ఎస్బీ డీఎస్పీగా బదిలీ చేశారు. మూడో బెటాలియన్ ఏసీ ఆర్.రామాంజినాయక్‌ను ఆత్మకూరు డీఎస్పీగా నియమించారు.

ఆదోని వన్ టౌన్ సీఐగా శ్రీరామ్

విశాలాంధ్ర-ఆదోని : బుధవారం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఆదోని వన్ టౌన్ సీఐగా సీఐ శ్రీరామ్ రానున్నారు. తిరుపతి జిల్లా ఆర్ఎస్‌టిఎఫ్‌లో పనిచేస్తున్న సీఐ బదిలీపై ఆదోని ఒకటో పట్టణ సీఐగా బదిలీ చేశారు. ఒకటో పట్టణ సీఐగా శ్రీరామ్ రానున్నడంతో పలువురు హర్షిస్తున్నారు. గతంలో మూడోపట్టణ సీఐగా పనిచేసిన సీఐకి పట్టణంలో చాలా మంచి పేరు, సొంతంగా ఫ్యాన్స్ ఫాలోయింగ్ కూడా ఉందని చెప్పవచ్చు. ఆయన ఒకటో పట్టణ సీఐగా రానున్నడంతో అవినీతి అక్రమాలకు పాల్పడి, మట్కా, బెట్టింగ్ , బెదిరింపులకు పాల్పడే రౌడీ షీటర్లు, కర్ణాటక మద్యం విక్రయదారులకు గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయని చెప్పవచ్చు. ఆదోని ఒకటో పట్టణ సీఐ తేజమూర్తి, కడప జిల్లాకు బదిలీ అయ్యారు.

అక్రమంగా నిలువ ఉంచిన ఇసుకను పట్టివేత

విశాలాంధ్ర-జిల్లా పరిషత్తు : కర్నూలు మండలం పరిధిలోని ఈ తాండ్రపాడులో బుధవారం తెల్లవారుజామున 140 టన్నుల ఇసుకను అక్రమంగా నిలువ ఉంచిన దానిని సీజ్ చేయడం జరిగిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజ్ చేసిన ఇసుకను మునిసిపల్ కార్పొరేషన్ పనులకు జిఎంసి వారి కాంట్రాక్టర్లకు కావాల్సిన పనులకు డబ్బులు కలెక్షన్ చేసుకుని ఇవ్వడం జరిగిందని తెలిపారు ఈ తనిఖీలో సబ్ అధికారులు మైనింగ్ అధికారులు మురహరి శేఖర్, రెవిన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

రైతులకు అనవసరమైన మందులు అంటగట్టరాదు

విశాలాంధ్ర-కోడుమూరు : రైతులు పురుగుల మందులు కొనేందుకు దుకాణాలకొచ్చిన సమయంలో వారు కోరిన పూత మందులు మాత్రమే ఇవ్వాలని, అదనంగా అనవసరమైన మందులు వారికి అంటగట్టరాదని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ పెస్టిసైడ్స్ డీలర్లకు సూచించారు. బుధవారం స్థానిక రాఘవేంద్ర ట్రేడర్స్‌లో పెస్టిసైడ్స్ ముందుల బిల్లులు,వాటి అనుమతి పత్రాలు తదితర రికార్డులు పరిశీలించారు. పురుగుమందును తనిఖీ చేసి, విశాఖపట్నంలోని ల్యాబ్‌లో వాటి నాణ్యత ప్రమాణాలను పరిశీలనకు 5 రకాల పురుగు మందుల నమూనాలు సేకరించారు. పూత మందుల కోసం వచ్చిన రైతులకు అనవసరంగా ఉపయోగము లేని పెస్టిసైడ్స్ మందులు అంటగడితే,అలాంటి డీలర్స్ పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత
ముగ్గురి అరెస్టుతో పాటుగా బొలెరో వాహనం స్వాధీనం

విశాలంధ్ర-కర్నూలు క్రైం : బొలెరో ట్రాలీ వాహనంలో భారీగా కర్ణాటక మద్యం కర్నూలుకు తీసుకువస్తుండగా నాలుగో పట్టణ సీఐ శంకరయ్య, పోలీసు సిబ్బంది పట్టుకున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ కు వచ్చిన సమాచారం మేరకు కర్నూల్ ఎస్డిపిఓ విజయ శేఖర్ ఉత్తర్వులను మేరకు బుధవారం ఉదయం కర్నూల్ టౌన్, కల్లూర్ మండలం, సంపత్ నగర్ ఆర్చి వద్ద పంచాయతీదారుల సమక్షంలో ఓవాహనంలో రవాణా చేయుచున్న కర్నాటక రాష్ట్రంనకు చెందిన 52 అట్టపెట్టెలదు ఉండిన రూ.1,99,53ల విలువ కల 90 ఏంఎల్ పరిమాణం కల 4,992 ఒరిజినల్ ఛాయస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు కర్నూలు నాలుగో పట్టణ పీస్ సీఐ పి.శంకరయ్య, సిబ్బంది సహాయంతో దాడి చేసి పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు.

సీఐ మాట్లాడుతూ సదరు వాటిని తనగ్రామంలో అధిక ధరలకు అమ్ముకుందామని వాటిని రవాణ చేయుచున్న కర్నూలు జిల్లా, క్రిష్ణగిరి మండలం, హెచ్. తాళ్ల గోకులపాడు గ్రామానికి చెందిన బోయ పూల జాన, బోయ అజేయుడు, బోయ అంజి, బోయ హనుమన్నలను అరెస్ట్ చేసి వాహనంలో రవాణా చేయుచున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

52 అట్ట పెట్టెలందు ఉండిన రూ.1,99,530 విలువ గల పరిమాణం కల 4,992- ఒరిజినల్ ఛాయస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు ను, %శ్రూ21ూ%-6310 అన్న నంబర్ కల ఒక మహీంద్రా బొలెరో మాక్సిమ్మో వాహనంను మరియు వాటి రవణా కు పాల్పడిన %ూ.33+%-0151 అన్న నంబర్ కల ఒక హెూండా షైన్ మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకోవడం జరిగింది. వారిని రిమాండు నిమిత్తం కోర్టు ముందు హాజరు పరచినట్లు తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 01,ఆగస్టు 2024

ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించాలి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : జిల్లాలోని ప్రతి గ్రామం, పట్టణాల్లో కచ్చితంగా ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రక్రియ మొదలు కావాలని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తొలిరోజు 99 శాతం పెన్షన్ లను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా స్పెషల్ ఆఫీసర్ లను, ఎంపీడీవోలు,మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై సంబంధిత జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు,మున్సిపల్ కమిషనర్లతో మండలాలు,మునిసిపాలిటీల వారీగా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నెలలో కొన్ని మండలాలలో ఉదయం 11, 12 గంటలకు కూడా పింఛన్లపంపిణీ ప్రక్రియ ప్రారంభించలేదని, ఈసారి ఆ విధంగా జరిగినట్లయితే సంబంధిత మండలాల ఎంపీడీవోలు, మండల స్పెషల్ అధికారులు బాధ్యత వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. గ్రామాల వారీగా పెన్షన్ పంపిణీ చేసే అధికారులను ఈరోజు పిలిపించుకొని ప్రతి గ్రామంలో ఉదయం 6 గంటలకే పెన్షన్ పంపిణీ ప్రక్రియ మొదలు పెట్టి, 99 శాతం పూర్తి చేయాలని చెప్పాలన్నారు..1, 2 తేదీల్లో రెండు రోజులు మాత్రమే పెన్షన్ పంపిణీ ఉంటుందని, తర్వాత పెన్షన్ పంపిణీ చేసేందుకు యాప్ పని చేయదు అనే విషయాన్ని పెన్షన్ దారులకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కు సంబంధించి అవసరమైన నగదును బ్యాంకుల నుంచి ఈరోజు సాయంత్రం లోపు విత్ డ్రా చేసుకొని పంపిణీకి సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. నగదును విత్ డ్రా చేసుకోవడంలో ఏమైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకొని రావాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు..ఆర్డీవోలు, సబ్ కలెక్టర్ ఈ అంశంపై తమ డివిజన్ లోని ఎంపీడీవోలు, స్పెషల్ ఆఫీసర్లతో మాట్లాడి పర్యవేక్షణ చేయాలన్నారు.. బయోమెట్రిక్ డివైస్ లు ఎక్కడైనా తక్కువగా ఉంటే మున్సిపల్ కమిషనర్ లతో మాట్లాడి బయోమెట్రిక్ డివైస్ లను అడ్జస్ట్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పింఛన్ పంపిణీ అధికారులు తమ పరిధిలో మ్యాపింగ్ చేసిన పెన్షన్ దారులకు ముందుగానే సమాచారం అందచేసి, వారిని అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని, ఆ విధంగా చేయడం ద్వారా తొలిరోజే 100 శాతం పురోగతి సాధించేందుకు వీలవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. మండలాల్లో పెన్షన్లు ఎన్ని ఉన్నాయి, ఒక్కొక్కరికి గరిష్టంగా ఎన్ని పెన్షన్ లను మ్యాపింగ్ చేశారు, గత నెలలో ఆలస్యంగా పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభించిన మండలాలు ఈసారి సమయానికి పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభించే విధంగా ఎలాంటి చర్యలు తీసుకుంటారనే విషయాన్ని సంబంధిత మండలాల ఎంపీడీవోలను, మండలస్పెషల్ అధికారులు,మునిసిపల్ కమిషనర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కోసిగి, హొళగుంద, మంత్రాలయం, కౌతాళం, పెద్దకడబూరు, హాలహర్వి తదితర మండలాల్లో ఒక్కొక్కరికి 50 మంది కంటే ఎక్కువ కేటాయించడంతో పింఛను పంపిణీ చేసే అధికారుల పరిధిలో 50 మంది నుండి గరిష్టంగా 60 మంది వరకు పింఛన్లపంపిణీ చేసే విధంగా మ్యాపింగ్ చేసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పంపిణీ చేయని పెన్షన్ లకు ఎందుకు ఇవ్వలేదో కారణాలను తెల్పాలని,.ఆ మొత్తాన్ని 2,3 రోజుల్లో రెమిటెన్స్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి, డిఆర్డీఏ పీడీ సలీంబాషా, ఎల్డిఎం రామచంద్ర రావు, తదితరులు పాల్గొన్నారు..

ధనాపురం-హొళగుంద రోడ్డు నిర్మాణం చేపడతాం

విశాలాంధ్ర-హొళగుంద: ధనాపురం నుండి వయా హెబ్బటం హొలగుంద రోడ్డు నిర్మాణం చేపడతామని మాజీ మండల టీడీపీ కన్వీనర్ పి వీరన్నగౌడ అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి 2 నెలలు కూడా పూర్తి కాలేదని అప్పుడే అభివృద్ధిపై విమర్శలు చేయడం తగదని హెచ్చరించారు. మండల అభివృద్ధితో పాటు నియోజకవర్గ అభివృద్ధికి ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ వీరభద్రగౌడ ఎనలేని కృషి చేస్తున్నారని అభివృద్ధికి అందరూ సహకరించాలి తప్ప సోషల్ మీడియాలో ట్రోల్ చేయడం తప్పనన్నారు. మండలంలో వర్షం లేక రైతులు రోజు ఎదురు చూస్తుంటే కొందరు పనిగట్టు కొనిరోడ్డుపై నీళ్ల చెరువుల నిలబడినట్లు గతంలో ఉన్న ఫోటోలు పెట్టి రోడ్డు అధ్వానంగా ఉన్నట్లు నటిస్తూ ఫోటోలు పెట్టి ప్రజలకు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయంలో ఏమి అడగని వారు సోషల్ మీడియాలో పెట్టని వారు ఈరోజు అభివృద్ధి పై సోషల్ మీడియాలో పాత ఫోటోలు పెట్టి ట్రోల్ చేస్తున్నారని వాపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాని మోదీతో చర్చించి రాష్ట్ర అభివృద్ధికి 15 వేల కోట్లు నిధులు తీసుకువచ్చారని ఇది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. అలాగే రాష్ట్రంలో రోడ్లు అద్వాన్నంగా ఉంటే వెంటనే రోడ్డు మరమ్మతు చేయడానికి ముఖ్యమంత్రి రూ.300 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ వీరభద్రగౌడ కృషితో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖమంత్రి లోకేష్ దృష్టికి మార్లమడకి బస్సు సౌకర్యం కోసం విన్నవిస్తే వెంటనే బస్సు మంజూరు చేశారని అలాగే రోడ్డు మరమ్మతు చేపట్టడం జరిగిందని పెద్దహేటకు కొత్త బస్సు మంజూరు అవుతుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నారని అక్కాచెల్లెళ్లకు, వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్లను పెంచి నెలవారీ జీతాలు మాదిరిగా పెన్షన్లు ఇస్తుంటే ఇంతకన్నా అభివృద్ధి ఇంకేం కావాలని పేర్కొన్నారు. ఆర్అండ్‌బి శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జిల్లా వాసిగా ఉన్నారని ఆయన దృష్టికి ఆలూరు నియోజకవర్గం వీరభద్రగౌడ్ రోడ్ల దుస్థితిని తీసుకెళ్లారని ధనాపురం హొలాగుందా రోడ్డు, హొళగుంద వయా ఎల్లార్తి ఆలూరు, హొళగుంద వయసులువాయి ఆలూరు రోడ్డుతో పాటు గ్రామీణ ప్రాంతాల రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తారని స్పష్టం చేశారు వైసీపీ హయంలో కిమ్మనని వారు నేడు సోషల్ మీడియాలో రోడ్ల దుస్థితిని ట్రోల్ చేస్తూ హీరోఇజం ప్రదర్శిస్తూ పేపర్ పులి కావడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వారి మాటలను ప్రజలు ఎవరు నమ్మవద్దని ఎన్డీఏ కూటమి హయంలో మండలాభివృద్ధి చేపట్టడం జరుగుతుందని అన్నారు. పట్టుమని రెండు నెలలు పూర్తికాక మునుపే అభివృద్ధి పై విమర్శించడం తగదని హెచ్చరించారు హైస్కూల్లో మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక కన్నడ, ఉర్దూ మీడియం పాఠశాలలు మంజూరు చేసి విద్యార్థులు కష్టాలు తీర్చి విద్యాభివృద్ధికి సహకరించారని వారికి అభినందాల్సింది పోయి పని కట్టుకొని విమర్శించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. నియోజకవర్గం అభివృద్ధి ఆలూరు నియోజకవర్గం వీరభద్రగౌడతోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఈసమావేశంలో మండల బిజెపి కన్వీనర్ ప్రసాద్, జనసేన పార్టీ కన్వీనర్ అశోక్, జనసేన నాయకుడు వీరేష్, టీడీపీ నాయకులు మోయిన్, అబ్దుల్ సుభాన్, జాకీర్, జుమ్మాసలీం మంగయ్య, గాది లింగప్ప, ఈరన్న, గంగ, శాలిఆమన్, అల్తాఫ్, మున్నా, కుద్లూరు సుభాన్ తదితరులు పాల్గొన్నారు

హంద్రీనీవా నీళ్ళు కోసం రైతులు ఎదురుచూపు

విశాలాంధ్ర-కర్నూలు: జిల్లా మీదుగా ప్రవహిస్తున్న హంద్రీనీవా ప్రధాన కాలువకు సూరత్ నుండి చెన్నై రహదారి వేసే కాంట్రాక్టర్లు హంద్రీనీవా ప్రధాన కాలువకు మట్టి వేసి నీళ్లు పోకుండా అడ్డుకట్ట వేయడం దారుణం అని ఏ పీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాధం ఒక ప్రకటన లో తెలిపారు ..తక్షణమే హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా నీళ్లు పోయే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.శ్రీశైలం ప్రాజెక్టుకు 885 అడుగులకు నీరు చేరింది. ప్రాజెక్టులో నీళ్లు సంపూర్ణంగా ఉన్నాయి. వెంటనే పోతిరెడ్డిపాడు ద్వారా మరియు మల్యాల దగ్గర ఉన్నటువంటి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పంట పొలాలకు త్రాగునీటికి నీరు విడుదల చేస్తారని ఈ నేపథ్యంలో శ్రీశైలం జలాలు మాల్యాల దగ్గర ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా హంద్రీనీవా ప్రధాన కాలువకు ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు వస్తుంది. కర్నూలు జిల్లాలోనే 81,000 వేల ఎకరాల పంట పొలాలకు నీళ్లు వస్తాయి.ఈ 81 వేల ఎకరాలకు నీళ్లు వచ్చే ప్రధానంగా కాలువకు, రాయలసీమ జిల్లాల్లో ఆరు లక్షల ఎకరాలకు నీరు అందించే సుజల స్రవంతి కాల్వను పూడ్చివేయడం చాలా దుర్మార్గమన్నారు. తక్షణమే ఈ కాలువను పూడ్చినటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.. ఈ కాలువ ద్వారా నందికొట్కూరు,క్రిష్ణగిరి, పత్తికొండ,మద్దికేర,తుగ్గలి, దేవనకొండ,కల్లూరు తదితర ప్రాంతాలకు పంట పొలాలకు నీళ్లు వస్తాయన్నారు.తక్షణమే హంద్రీనీవా కాలువవకు అడ్డుగా ఉన్నటువంటి మట్టిని తక్షణమేతొలగించాలి. ఆలస్యం చేయకుండా యుద్ధ ప్రాతిపదికన హంద్రీనీవానీవా ప్రధాన కాలువకు అడ్డుగా ఉన్నటువంటి మట్టిని తొలగించి నీళ్లు సాఫీగా పోయే విధంగా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున జిల్లా యంత్రాంగాన్ని అందులో ప్రధానంగా జిల్లా కలెక్టర్ గారిని , ఎస్.సి గారిని వ్యవసాయ అధికారులకు తెలియజేస్తున్నామన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి -వ్య.కా.స.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

విశాలాంధ్ర-పత్తికొండ: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు జిల్లా పత్తికొండలో వ్యవసాయ కూలీలతో కలిసి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు 9 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఉపాధి హామీ కూలీలకు పనిముట్లు, మెడికల్ కిట్లు పంపిణీ చేయాలని, పని దినాలను 200 రోజులకు పెంచి కనీస వేతనం రోజుకి 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని, లేనియెడల మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఏపీఓ వెంకటేశ్వర్లు కు వినతి పత్రం సమర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. నబి రసూల్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు నెట్టికంటయ్య,పందికోన, కొత్తపల్లి సిపిఐ శాఖ కార్యదర్శులు జొహరాపురం కాశి, గిడ్డయ్య గౌడ్, నాయకులు గుండు బాష, ఉపాధి హామీ కూలీలు ఉరుకుంద, నరసింహులు, రషీద్, ఆంజనేయులు మహిళలు పాల్గొన్నారు.

ఎనిమిది గేట్ల ద్వారా దిగివకు నీటి విడుదల -గరిష్ట స్థాయికి చేరిన నీటిమట్టం



విశాలాంధ్ర. బ్యూరో-కర్నూలు: శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుండి కొద్దిపాటి నీటి ప్రవాహం తగ్గింది. మంగళవారం రాత్రి 9 గంటల నుండి బుధవారం ఉదయం 11 గంటల వరకు పది గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. ఉదయం 12 గంటల నుండి 8 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి దిగువకు 2,23,768 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.మూడు గంటల సమయానికి ఎగువ జూరాల నుండి 2, 77, 285 క్యూసెక్కులు, తుంగభద్ర ద్వారా స్వల్పంగా 16,256క్యూసెక్కులు కలిపి 2, 9 3, 813 క్యూసెక్కుకుల నీరు చేరుతున్నాయి. అదే సమయానికి జలాశయ నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకొని 8 8 4.5 0 అడుగులకు చేరింది.నీటి నిల్వ సామర్థ్యం 212.9198 టీఎంసీలుగా ఉంది. అలాగే కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రంలో గడచిన 24 గంటలలో 24,917 క్యూసెక్కుల నీటితో 14.586 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని, ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో 35,315 క్యూసెక్కుల నీటితో 17.667 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తిని చేస్తూ దిగువ సాగరకు 60,232 నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ కు 24,0 83 క్యూసెక్కులు మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ 1600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.దిగువ సాగర్ కు 2,84,000క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.జలాశయం నుండి మొత్తము 3,09,683 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రైతులకు అనవసరమైన మందులు అంటగట్టరాదు-వ్యవసాయ అధికారి రవిప్రకాష్

విశాలాంధ్ర-కోడుమూరు : రైతులు పురుగుల మందులు కొనేందుకు దుకాణాలకు వచ్చిన సమయంలో వారు కోరిన పూత మందులు మాత్రమే ఇవ్వాలని, అదనంగా ఎటువంటి అనవసరమైన పెస్టిసైడ్స్ మందులను వారికి అంటగట్ట రాదని కోడుమూరు మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ పెస్టిసైడ్స్ డీలర్లకు సూచించారు. స్థానిక రాఘవేంద్ర ట్రేడర్స్‌లో పెస్టిసైడ్స్ ముందుల బిల్లులు,వాటి అనుమతి పత్రాలు తదితర రికార్డులు పరిశీలించారు. పురుగుమందును తనిఖీ చేసి, విశాఖపట్నంలోని ల్యాబ్‌లో వాటి నాణ్యత ప్రమాణాలను పరిశీలనకు 5రకాల పురుగు మందుల నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏవో రవిప్రకాష్ మాట్లాడుతూ రైతులు పురుగుల మందుల కోసం డీలర్ల దగ్గరకు వస్తే,ముందుగా వారి పంట పొలాల్లోని తెగుళ్ల,పంటలకు పట్టిన పురుగుల గురించి ఆరా తీసిన తర్వాతనే అవసరమైన పెస్టిసైడ్స్ మందులు ఇవ్వాలని తెలిపారు.పూత మందుల కోసం వచ్చిన రైతులకు అనవసరంగా ఉపయోగము లేని పెస్టిసైడ్స్ మందులు అంటగడితే, అలాంటి డీలర్స్ పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో పత్తి పంటలు సాగు చేసిన రైతులు తమ పంట పొలాల్లో గులాబీ రంగు పురుగులు,రెక్కల పురుగులు కనిపించినట్లయితే రైతు సేవ కేంద్రాలు కానీ,మండల వ్యవసాయ కార్యాలయమునకు కానీ వెళ్లి వ్యవసాయ అధికారులను సంప్రదించి,వారి సూచనలు మేరకు పురుగుల మందులు పిచికారీ చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పెస్టిసైడ్స్ దుకాణాల డీలర్లు,వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్త్రీల్లో రక్తహీనతకు సకాలంలో చికిత్స అందించాలి

నంద్యాల శాఖ అధ్యక్షురాలు డాక్టర్ వసుధ రాణి

విశాలాంధ్ర-నంద్యాల : భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో భారత్ సీరమ్స్, వ్యాక్సిన్స్ (బిఎస్ వి) కంపెనీ సహకారంతో స్థానిక మధుమణి నర్సింగ్ హోమ్ సమావేశ భవనంలో నంద్యాల ప్రాంత వైద్యులకు నిరంతర వైద్య విద్య సదస్సు నిర్వహించారు. నంద్యాల శాఖ అధ్యక్షురాలు డాక్టర్ వసుధ రాణి అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సులో కాన్పు తర్వాత ఐరన్ లోపం వలన వచ్చే రక్తహీనత చికిత్సా విధానాలపై స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ అనూష, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ ప్రాథమిక దశలో గుర్తించడం ఎలా అన్న అంశంపై డాక్టర్ గీతావాణి మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా వైద్యులకు వివరించారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ ప్రసవం తర్వాత చాలామంది స్త్రీలలో ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన వారిలో ఐరన్ లోపం వలన రక్తహీనత సంభవించడం అధికంగా ఉందని, రక్తహీనత ఉన్న స్త్రీలలో నీరసం, కళ్ళు తిరగడం, ఆయాసం, నాడి వేగం పెరగడం, చర్మం పాలిపోయి ఉండడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని, ఆ సమయంలో రక్తహీనతను సరిచేయాల్సిన అవసరం ఉంటుందని లేకుంటే గుండె ఫెయిల్యూర్ లోకి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. వీరికి రక్తం ఎక్కించడం లేదా ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోస్ (ఎఫ్ సిఎం) సరైన మోతాదులో ఎక్కించడం ద్వారా సరి చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదనరావు, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి, నంద్యాల శాఖ కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర ఐఎంఏ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు సబ్ రిజిస్టర్ గా ఫిరోజ్

విశాలాంధ్ర-కల్లూరు: కర్నూలు సబ్ రిజిస్టర్ గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కర్నూలు సబ్ రిజిస్టర్ గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో నంద్యాల జిల్లా నుండి ఫిరోజ్ బుధవారం సాధారణ బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందిస్తానని సిబ్బంది కూడా ఏమైనా సమస్యలు ఉత్పనమైనప్పుడు ఒకరికొకరు చర్చించుకొని పరిపాలన శాపిగా జరిగేందుకు కలిసి పనిచేద్దామని ఆయన సిబ్బందికి సూచించారు. పలువురు డాక్యుమెంటర్లు , కార్యల సిబ్బంది ఆహ్వానంపలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

4న అంజుమన్ స్కాలర్షిప్‌లు పంపిణీ

విశాలాంధ్ర-నంద్యాల: 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన అంజుమన్ స్కాలర్షిప్ లు ఆగస్టు నెల 4వ తేది ఆదివారం ఉదయం 10గం.కు ఆర్టిసి బస్టాండ్ ఎదురుగా వున్న అంజుమన్ షాదిఖానాలో పంపిణీ చేస్తున్నట్లు 'ది నంద్యాల అంజుమన్ ట్రస్టు' చైర్మన్ నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. నంద్యాల పట్టణ పరిధిలోని 2024 సం. పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి ధరఖాస్తు చేసుకున్న 350 మంది పేద ముస్లిం విద్యార్థిని,విద్యార్థులకు ప్రతి ఒక్కరికి నగదు చెక్కుగా రూ.3 వేలు పంపిణీ చేస్తున్నట్లు ఖుద్దూస్ తెలిపారు. విద్యార్థులు తప్పక ఆదివారం హాజరై ఈ కార్యక్రమాన్ని సఫలికృతం చేయాలని ఖుద్దూస్ తెలిపారు.

ఏపీ ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఏపీఓఎస్ఎస్ ద్వారా 2024-25 నకు సంబంధించి పది - ఇంటర్మీడియట్ తరగతుల్లో అడ్మిషన్ పొందడానికి రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం ఏపీఓఎస్ఎస్ సంచాలకులు వారు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగినది పదిలో చేరుటగాను 14ఏళ్లు నిండి, ఇంటర్‌కు పదవ తరగతి పాసై 15 ఏళ్లు నిండిన వారు దరఖాస్తులు చేసుకునేటకు కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి సామ్యూల్ బుధవారం తెలిపారు.ప్రతి ఒక్కరూ వినియోగించు కోవచ్చున్నారు వెబ్సైట్లో నందు బుధవారం నుండి అవకాశం కల్పించడం జరిగింది. అడ్మిషన్ ఆన్లైన్లో సబ్మిట్ చేయడానికి చివరి వరకు అడ్మిషన్ చివరి తేదీ 28-8బి2024 వరకు ఉంటుంది. ఆలస్య రుసుముతో సెప్టెంబరు 9 చివరి వరకు ఉంటుందన్నారు. ఏఐ సెంటర్ ను సంప్రదించి పూర్తి వివరాలను తెలుసుకోవచ్చున్నారు.

సమాజంలో న్యాయవాది వృత్తి కీలకం-జిల్లా జడ్జి ఎన్. శ్రీనివాసరావు

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్ : కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా జడ్జి పదవి విరమణ సందర్భంగా ఆయనకు ఘనంగా పూల బొకే శాలువా తో ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బిఎస్ .రవికాంత్ ప్రసాద్, సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి ఎన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో న్యాయవాది వృత్తి కీలకం మిగతా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి తర్వాత జిల్లా జడ్జిగా కర్నూల్ లో నాలుగు సంవత్సరాలుగా పనిచేసే అని 22 నెలలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సేవలు అందించాలని కావున న్యాయవాదులు వృత్తి ఛాలెంజ్గా తీసుకొని వచ్చే నూతన చట్టాలను కూడా పట్టుదలతో న్యాయవాదులుగా వృత్తిలో కొనసాగాలన్నారు. అలాగే సీనియర్ న్యాయవాదులు వై. జయరాజ్, ఎమ్మెల్. శ్రీనివాస్ రెడ్డి, ఏ. మాదన్న, ఏ ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ రవి గువెర, బి.దేపాల్, మహిళ ప్రతినిధి సుమనారని, తదితరులు పాల్గొన్నారు.

ముల్లకంప చెట్లు తొలగింపు

విశాలాంధ్ర-పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు రహదారి వెంబడి ఉన్న ముల్లకంపను బుధవారం జేసిబితో తొలగించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాల్లో ముల్లకంప చెట్లు మూసుకుపోయి విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బందులకు గురవుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ దృష్టికి తెచ్చారన్నారు. ఇందుకు తక్షణమే స్పందించి జేసిబితో ముల్లపొదలను తొలగించడం జరిగిందన్నారు. అలాగే పోలీసు స్టేషన్ నుండి పాఠశాల వరకు డ్రైనేజీలలో పేరుకుపోయిన పూడికను తీయించి మురుగు నీటిని క్లియర్ చేయించడం జరిగిందని ఆయన తెలిపారు.